



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సయ్య(ఫైల్)

పరిగి,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గొల్ల నర్సయ్య(60), తన మొక్కజొన్న పంటను కోతుల బారి నుంచి రక్షించుకునందుకు పంట చుట్టూ విద్యుత్ వైరుతో కంచే ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం ఉదయం పొలం చూడడానికి వెళ్లి ప్రమాదశశాత్తు విద్యుత్‌తీగకు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, నర్సయ్య మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

ఆర్మీ కళాశాలలో 19 వరకు స్పాట్ అడ్మిషన్స్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ(భువనగిరి) మహిళా కళాశాలలో రేపటి (19వ తేదీ) వరకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందాలనుకున్న మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజడ్‌సీ, బీజడ్‌సీ, బీకాం(జనరల్), బీకాం(సీఏ) గ్రూపుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, బోనోఫైడ్, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌ఫొటోలు తీసుకోని రావాలన్నారు. సందేహాల ఉంటే 7995010687, 7981199283 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

యోధుల త్యాగాలతోనే విముక్తి

రాచరికం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థగా ఆవిర్భావం



వేదికపై స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- తెలంగాణ చరిత్రలో సెప్టెంబరు 17 కీలకం
- దేశాభివృద్ధిలో రాష్ట్రానిది గేమ్ ఛేంజర్ పాత్ర
- ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజ
- ప్రజాపాలన దినోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఎంతో మంది అసమాన త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతం రాచరికం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థగా ఆవిర్భవించిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు.

వికారాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ చరిత్రలో సెప్టెంబరు 17 కీలకమైన రోజని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. దేశమంతటా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకుంటూ ఉంటే, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. నిజాం నిరంకుశ, నిర్బంధ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం చేసి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అప్పటి ప్రధాని నెహ్రూ, కేంద్ర హోంమంత్రి సర్ధార్ వల్లబాయ్ పటేల్ భారత సైన్యాన్ని రంగంలోకి

మిగతా 8వ పేజీలో...



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పేదల కడుపు నింపేలా

పేదలు కడుపు నిండా తృప్తిగా అన్నం తినాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. పదేళ్ల తర్వాత అర్హులైన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. జిల్లాలో రూ.235 కోట్లతో, వికారాబాద్‌లో రూ.125 కోట్లతో కొడంగల్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. వికారాబాద్‌లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ప్రారంభించగా, పరిగి కమ్యూనిటీ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు శంకుస్థాపన చేశారన్నారు.

ఉత్తమ సేవలందించాలి

- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
- కలెక్టరేట్ వద్ద ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

మేడ్చల్, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తూ, తమ గౌరవాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ గీతానికి గౌరవ వందనం చేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు నీతి నిజాయతీగా తమ విధులు నిర్వహిస్తూ తమ గౌరవాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీసీపీ కోటిరెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు, డీఆర్‌ఓ హరిప్రియ, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి వినోద్, డీఈవో విజయకుమారి, కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒకేరోజు అత్తా అల్లుడు మృతి

అనారోగ్యంతో ఉదయం అత్త.. రోడ్డు ప్రమాదంలో అల్లుడు



అత్త లక్ష్మి, అల్లుడు శ్రీనివాస్(ఫైల్)

వికారాబాద్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అత్త మృతి చెందగా, అదే రోజు రోడ్డు ప్రమాదంలో అల్లుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పులుమద్ది గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్(35) హైదరాబాద్‌లో రైల్వే హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన అదే గ్రామానికి చెందిన మహిళను వివాహం చేసుకోగా వారికి ఇద్దరు కుమారులు. శ్రీనివాస్ భార్య తల్లి(అత్త) జోగు లక్ష్మి అనారోగ్యంతో ఉదయం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మృతి చెందింది. ఇందుకు బ్యానర్లు కట్టాలని నిర్ణయించిన శ్రీనివాస్ వికారాబాద్‌కు వెళ్లి శ్రద్ధాంజలి బ్యానర్లు తీసుకెళ్తుండగా కొత్తగడి కనుకదుర్గా దాబా వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం శ్రీనివాస్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్
- హెల్త్ క్యాంపులో 56 రకాల పరీక్షలు



హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ మెగా హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 56 రకాల టెస్టులు, 17 రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచిన విషయం గుర్తు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందుతోందని గుర్తు చేశారు. వికారాబాద్‌లో మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.235 కోట్ల నిధులు మంజూరు చేయించి కొత్త భవనాలు, మౌలిక వసతులు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వికారాబాద్ పట్టణంలో పర్యటించిన స్పీకర్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో ఆధునికీకరణ పనులు, ఏరియా ఆసుపత్రిలో సివిల్ మరమ్మతులను, బాలికల స్కూల్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

జీపీవోలకు క్లస్టర్ల కేటాయింపు

- కలెక్టర్ సమక్షంలో 139 మందికి కౌన్సెలింగ్
- నేటి నుంచి కేటాయించిన క్లస్టర్లలో విధుల నిర్వహణ



కౌన్సెలింగ్‌కు హాజరైన జీపీవోలు

వికారాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు కేటాయించిన గ్రామ పాలన అధికారుల (జీపీవో)కు క్లస్టర్లను కేటాయించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్వో మంగీలాల్, ఏవో ఫర్హీన్ ఖాటూన్‌లతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో 236 రెవెన్యూ క్లస్టర్లు ఉండగా, జిల్లాకు మొత్తం 163 మంది జీపీవోలను కేటాయించిన విషయం తెలిసిందే. కాగా, వారిలో జిల్లాకు చెందిన 139 మంది జీపీవోలకు కౌన్సెలింగ్ నిర్వహించి క్లస్టర్లు కేటాయించారు. తమకు కేటాయించిన క్లస్టర్లలో గురువారం నుంచి జీపీవోలు విధులు నిర్వహించాలని ఆదేశించారు.

విచారణ, ఎంపిక బాధ్యత జీపీవోలదే..

ఇక నుంచి ప్రతీ గ్రామంలో భూముల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక, తదితర ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కొత్తగా నియామకమైన గ్రామ పాలన అధికారులు చేపట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములు, సర్వే నంబర్లు, చెరువులు, కుంటలు, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పర్యవేక్షణ తదితర ప్రభుత్వ పరిపాలన వ్యవహారాలన్నీ జీపీవోలు పర్యవేక్షించనున్నారు జీపీవోలు 11 రకాల జాబ్ చార్ట్‌లను అనుసరించనున్నారు. భూభారతి చట్టంలో భాగంగా భవిష్యత్తులో ప్రతి రిజిస్ట్రేషన్ మ్యుటేషన్‌కు గ్రామ పటం అప్‌లోడ్ చేయడంతో జీపీవోలు సహకరించనున్నారు.

ఘట్‌కేసర్‌లో దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం



ఎన్ఎఫ్‌సీ నగర్ వద్ద కురుస్తున్న వాన

ఘట్‌కేసర్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా కురిసిన భారీ వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వాహనదారులకు దారి కనిపించకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ వర్షం ఘట్‌కేసర్‌లోని అవుటర్ వంతెన వరకే కురిసింది. కాగా, పోచారం మున్సిపాలిటీ పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. అనంతరం వాతావరణం ఎండగా మారింది.

విశ్వకర్మకు ఘన నివాళి



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఝాన్సీరాణి, వినోద్, విజయకుమారి, కాంతమ్మ, స్వర్ణలత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

-మేడ్చల్, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గొలుసు కట్టు.. ఆయువు పట్టు

జినుగుర్తి శ్రీరాములవారి ప్రాజెక్టు



పునరుద్ధరణకు రైతుల డిమాండ్

- చెరువులు నిండితే పెరగనున్న భూగర్భజలాలు
- 'పాలమూరు-రంగారెడ్డి' లింక్‌తో పంటలకు జీవం
- స్పెషల్ ఓటీ పాయింట్ల ద్వారా నీటి మళ్లింపునకు సర్వే
- కోట్‌పల్లి ప్రాజెక్టు కింద మొత్తం 23 చెరువులు

కాకతీయుల కాలంలో ప్రజలకు జీవనాధారం గొలుసుకట్టు చెరువులే.. వర్షపు నీరు వృథా పోకుండా ఒక చెరువు నిండిన తర్వాత దాని కింది చెరువు నిండేది.. ఇలా ఒడిసిపట్టిన నీరు యాడాదంతా నీల్వ ఉండి పాడి పంటలు వర్ధిల్లేవి. తాండూరు ప్రాంతంలోని 165 చెరువులను అనుసంధానం చేసి చెరువులను నింపితే కరువు ఛాయలు కానరాకుండాపోతాయి. అలాగే రంగారెడ్డి - పాలమూరు ఎత్తిపోతలను నింపి నీటిని చెరువులకు మళ్లిస్తే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. చెరువులకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం గొలుసుకట్టు విధానంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తాండూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చెరువులు, కుంటలు బోరు బావులపై ఆధారపడిన రైతులే ఎక్కువ. పూర్వం ఉన్న గొలుసుకట్టు చెరువులు కాలక్రమంలో కనుమరుగయ్యాయి. పాలకులు, అధికారులు, ప్రజలు పట్టించుకోక పోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. కొన్ని అక్రమార్కుల చేతుల్లో కుచించుకుపోయాయి. ఇలా గొలుసుకట్టు విధానం దెబ్బతిని భారీ వర్షాలు వస్తే వరదలు సంభవిస్తున్నాయి. ఇప్పుడు జిల్లా పరిధిలోని ప్రాజెక్టులను నింపి వాటి ద్వారా చెరువులకు నీటిని మళ్లించాల్సిన అవసరం ఉంది. చెరువులను అనుసంధానం చేయడంపై కార్యాచరణ రూపొందించాలని రైతులు కోరుతున్నారు.

అదనంగా 15 వేల ఎకరాలకు సర్వే

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నుంచి తాండూరు మండలం జినుగుర్తి వరకు కెనాల్ ద్వారా

మిగతా 8వ పేజీలో...

కాగ్నా నుంచి 14 టీఎంసీలు

తాండూరు మండలంలో చెంగోల్ పటేల్ చెరువు నుంచి పల్లోని చెరువు, ఊర చెరువు, గౌతాపూర్ మల్లన్నకుంట నుంచి చెనిగేష్‌పూర్ గండి చెరువు, సిరిగిరిపేట్ ఊర చెరువు నుంచి రాంపూర్ ఊర చెరువు నుంచి కింది చెరువు నుంచి ఉద్దండాపూర్‌లోని చెరువు ద్వారా జినుగుర్తి శ్రీరాముల వారి ప్రాజెక్టుకు సాగునీరు మళ్లించే అవకాశం ఉంది. ఇలా తాండూరు నియోజకవర్గంలో 165 లింకు చెరువులకు నీరు చేరుతుంది. తాండూరు కాగ్నా నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించినా ఇప్పటికే 14 టీఎంసీల నీరు కర్ణాటకకు తరలిపోతున్నాయి. ఈ నదిపై ఆరు టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మిస్తే ఇక్కడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



రాష్ట్రపతి ముర్మును కలిసిన బిక్కునాయక్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి కుల రాజకీయాలు చేయాలని చేసే కుట్రల పట్ల లంబాడీలకు అన్యాయం జరగకుండా చూడాలని బీజేపీ గిరిజన మోర్చా జాతీయ కౌన్సిల్ సభ్యుడు నానావత్ బిక్కు నాయక్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కొందరు నాయకులు లంబాడీలు గిరిజనులు కారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించినట్లు తెలిపారు.


ముర్ముకు వినతిపత్రం ఇస్తున్న బిక్కు నాయక్

జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌కు నిశాంత్‌రెడ్డి ఎంపిక

ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఐఐటీఎం డిగ్రీ కళాశాల విద్యార్థి కొంతం నిశాంత్‌రెడ్డి జిమ్నాస్టిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి ఎరోబిక్స్ ఫిట్నెస్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నిశాంత్‌రెడ్డిని ప్రిన్సిపాల్ సురకంటి రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సురకంటి పద్మారెడ్డి, కందకట్ల బాబుల్‌రెడ్డి, అధ్యాపకులు ఆయనకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు.


నిశాంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న అధ్యాపకులు

పారిశ్రామిక ప్రగతికి తార్కాణం విశ్వకర్మలు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత పారిశ్రామిక రంగ ప్రగతికి తార్కాణం విశ్వకర్మలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను ఈవృత్తుల వారికి చేయూతనిస్తాయని ఆయన అన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.కలెక్టరేట్ సముదాయం ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు - ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా స్వచ్ఛతాహీ సేవ-2025 కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛతతో పల్లెలు మెరవాలని, అన్ని కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛోత్సవ్ ఇతివృత్తంతో కార్యక్రమాలు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లాలోని అన్నీ మండలాలు, అన్నీ గ్రామాలలో నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలన్నారు. స్వచ్ఛతపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, డీఆర్వో సంగీత, డీసీపీ సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, అదనపు పీడీ సుభాషిణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీవో సౌమ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


విశ్వకర్మ భగవాన్ జయంత్యుత్సవంలో కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

మోదీ పాలనలో అగ్రస్థానంలో దేశం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పాలనలో దేశం అగ్రగామిగా నిలిచిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా వికారాబాద్‌లోని ఆర్యవైశ్య భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీ మాట్లాడుతూ.. మోదీ పాలనాదక్షతతో ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. భారత్ అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. శిబిరంలో బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు పాల్గొని రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. యువత మొత్తం మోదీ వెంటే ఉన్నారన్నారు. అలాగే చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళ-శక్తిమంతమైన కుటుంబం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై రక్తదానం చేసిన వారికి ఎంపీ సర్టిఫికెట్లు, టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఇదిలా ఉంటే మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తపురం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది వరకు బీజేపీ శ్రేణులు రక్తదానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్, కంజర్ల ప్రకాష్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు


రక్తదాతలకు పత్రాలను అందజేస్తున్న వడ్లనందు

విశ్వకర్మ మహాయజ్ఞంలో ఎంపీ

చేవెళ్లలోని శ్రీ బ్రహ్మగిరి క్షేత్రంలో బుధవారం శ్రీగాయత్రీ విశ్వకర్మ మహాయజ్ఞ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. విశ్వకర్మ యువజన కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం విశ్వకర్మ భగవానుడిని చేవెళ్ల మండల కేంద్రంలో ఊరేగించారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నంతో పాటు బీజేపీ నాయకులు అనంతరెడ్డి, మాణిక్యరెడ్డి, శర్వలింగం, తదితరులు భగవానుడిని దర్శించుకున్నారు. విశ్వకర్మ సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాసచారి, శంభులింగం, వి. శ్రీనివాసచారి, బాలాచారి, లింగాచారి, మాణిక్యచారి, మోనాచారి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

● **మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

కడ్తాల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు అండగా ఉంటామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. నాయకులను, కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ఏ ఆపద వచ్చినా కుటుంబంలో ఒకరిగా చూసుకుంటుందన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో బుధవారం జైపాల్‌యాదవ్ పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నర్సింహ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, గోపాల్, వసంత, రమేశ్, బాలకృష్ణ, లింగం, జితేందర్ రెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.

స్కావెంజర్ల వేతనాల్లో స్కాంపై ఆరా

మహేశ్వరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో జిల్లాకే ఆదర్శంగా నిలిచిన మహేశ్వరం ఆదర్శపాఠశాల.. కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చాక విద్యాబోధనలో వెనకబడడమే కాకుండా అవినీతి, అక్రమాల ఆరోపణలను ఎందుకు ఎదుర్కోవలసి వస్తుందని బీఆర్ఎస్ మహేశ్వరం మండలాధ్యక్షుడు ఆంగోత్ రాజునాయక్ అన్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగిందనే ఆరోపణలపై ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు మహేశ్వరం ఆదర్శపాఠశాలను సందర్శించి ఆరా తీశారు. ఇకనుంచైనా మంచి విద్యాబోధన జరగాలని, లేని పక్షంలో పాఠశాల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోతీలాల్, కాడమోని ప్రభాకర్, దేవ్లానాయక్ పాల్గొన్నారు.

గౌడ సంఘం భవన నిర్మాణం చేపడతాం


ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

కులకచర్ల/పరిగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పరిగిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు పరిగి నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు కలిసి భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిగిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పరిగి, దోమ, కులకచర్ల, గండీడ్, మొహ్మదాబాద్, పూడూర్ మండలాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గౌడ సంఘం తాలుకా అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్

పరిగి నియోజకవర్గం గౌడ సంఘం కమిటీని బుధవారం పరిగిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి తాలుకా అధ్యక్షుడిగా ఇంజమూరి రాజేందర్ ఎన్నికయ్యారు. కో-కన్వీనర్లుగా రాఘవేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే పరిగి, కులకచర్ల, దోమ, మహమ్మదాబాద్, పూడూరు చౌడాపూర్ మండలాల బాధ్యులను ఎన్నుకున్నారు.


రైతులకు అన్యాయం చేయొద్దు

కడ్తాల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణ పనులు నిలిపేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పచ్చటి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరాయి. దీక్షలో బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంప శ్రీనివాస్, పాండు యాదవ్, చేగూరి రాములు, కందికంటి కేశవులు కూర్చున్నారు. తల్లోజు ఆచారి, గంప వెంకటేశ్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కండె హరిప్రసాద్, తిప్పిరెడ్డి రాంరెడ్డి, దోనాదుల మహేశ్, పత్యానాయక్, కడారి రామకృష్ణలు సంఘీభావం తెలిపారు. పెంటారెడ్డి, గోరటి కృష్ణ, తదితరులు ఉన్నారు.

చిరుత సంచారంపై ఆరా తీస్తున్నాం

తాండూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తట్టేపల్లి శివారులో చిరుత ఆనవాళ్లు గుర్తించామని తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి తెలిపారు. సరిహద్దు ప్రాంతాలైన ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డతండా, ఆడ్కిచర్ల, పాషాపూర్, కర్ణాటకలోని కిష్టాపూర్, మిర్యాణ్, కల్లూరు, చందాపూర్, చించోళి ప్రాంతాల ప్రజలు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు.















భూములు లాక్కుంటే ఊరుకోం

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వికారాబాద్/మోమిన్‌పేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇష్టానుసారంగా రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని, చట్టప్రకారం వ్యవహరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న టేకులపల్లి, దేవరంపల్లి, పులుసుమామిడి, పాతూరు గ్రామాల రైతులు వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఆయన రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూములను వదిలి ప్రైవేటు వ్యక్తుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రీజనల్‌రింగ్ రోడ్డు భూ సేకరణలో కూడా కేంద్ర ఇచ్చిన అలైన్‌మెంట్ కాకుండా, సొంత డబ్బుతో కడుతున్నామని చెప్పి.. తమకు చెందినవారి భూములను కాపాడుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రింగ్ రోడ్డును సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగా తీసుకువెళ్లాలని, పేద ప్రజల భూములకు నష్టం జరుగకుండా చూడాలన్నారు. స్థానిక శాసనసభ్యులతో కలిసి స్పీకర్‌తో మాట్లాడతానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, నాయకులు గోపాల్, అనంత్ రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మించాలి

యాచారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపట్టాలని, అలైన్‌మెంట్ మార్చితే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులు, ఎమ్మెల్యేల భూములు కాపాడేందుకు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం దారుణమని మండిపడ్డారు. బుధవారం అన్నెబోయినపల్లిలో ట్రిపుల్‌ఆర్ నిర్మాణం పాత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్, సీపీఎం శ్రేణులు ఆందోళనకు దిగారు. దాంతో మాడ్గుల పోలీసులు వారిని అరెస్టు చేసి యాచారం పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ స్వార్థం కోసం అలైన్‌మెంట్‌ను మార్చి పేదలను రోడ్డున పడేస్తామనే ఆలోచన సరికాదని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాలయాపన చేయడంతో వేలాది మంది విద్యార్థులు చదువు అర్ధాంతరంగా మానేస్తున్నారని అన్నారు. కాగా, ఇదే అంశంపై జైపాల్‌యాదవ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఫోన్‌లో సంప్రదించి వివరించారు. రైతుల పక్షాన ఉద్యమించాలని, పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం మంచిదికాదని, రైతులకు అన్యాయం చేయడం సరికాదని కేటీఆర్ చెప్పినట్లు ఆయన వివరించారు.



వికారాబాద్ : రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్

రైతులను వీధిన పడేస్తామంటే ఎలా?

పాత అలైన్‌మెంట్ ప్రకారంగా రోడ్డు నిర్మాణం చేపట్టకుండా ఇష్టానుసారంగా అలైన్‌మెంట్ మార్చి రైతులను వీధిన పడేస్తామంటే ఎలా అని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. రైతులకు న్యాయం చేసేదాకా పోరాటం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు యాచారం పోలీస్ స్టేషన్ చేరుకొని బీఆర్ఎస్, సీపీఎం నాయకులను, కార్యకర్తలను సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కె.రమేష్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు యాదయ్య, ఖాజొద్దీన్, వెంకటేష్, జగన్ తదితరులు ఉన్నారు.


ఘట్‌కేసర్ : టీచర్లకు జ్ఞాపికలు అందిస్తున్న కల్నల్ సీఎస్ రావు

దేశభద్రతలో భాగస్వాములవ్వాలి

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు శక్తిసామర్థ్యాలను పెంపొందించుకొని దేశ భద్రతలో భాగస్వాములు కావాలని తెలంగాణ మహిళా ఎన్‌సీసీ 7వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సీఎస్ రావు ఆకాంక్షించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాలను బుధవారం ఆయన సందర్శించి ఎన్‌సీసీ క్యాడెట్లతో ముచ్చటించారు. రావు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరి రక్షణ రంగంలో ఉద్యోగాలు పొందాలని కోరారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, హవల్దార్ ముస్తఫా, ప్రతిభ, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, ఘట్‌కేసర్‌లోని జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో ఎన్‌సీసీ నూతన యూనిట్‌ను సీఎస్ రావు ప్రారంభించారు. ఎంఈవో శ్రీధర్, హెచ్ఎంలు విజయ, పాపిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, నాగులు, సతీష్, సుమన్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్యజ్యోతి): 108 సిబ్బంది సేవలు అభినందనీయమని హిమాయత్ నగర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీది శ్రీను అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంఘం ఆధ్వర్యంలో 108 సిబ్బందిని హిమాయత్ నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద సన్మానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి పైలు శ్రీధర్, కట్టమీది ప్రకాశ్, షాబాద్ దర్శన్, బుర్రకాయల మహేష్ ముదిరాజ్, కంజర్ల శివయ్య, కట్టమీది రాకేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా శివప్ప

బషీరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం మండలాధ్యక్షుడిగా సత్య శివప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం బషీరాబాద్‌లోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-28 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పి.నర్సిరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా కె.ప్రకాష్ వ్యవహరించారు. నూతన కమిటీలో అసోసియేట్ అధ్యక్షులుగా దశరథ్, ఉపాధ్యక్షులుగా హన్మంతు, ఉపాధ్యక్షురాలిగా లలిత, ప్రధాన కార్యదర్శిగా కె.మొగులప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.ప్రకాశం, ప్రచార కార్యదర్శిగా ఎ.సుభాష్, కోశాధికారిగా బి.రాములు, సంయుక్త కార్యదర్శిగా పి.శంకరమ్మలను ఎన్నుకొన్నారు.

డీఎల్పీవోగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాండూరు డీఎల్పీవోగా ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శంకర్‌నాయక్ నల్లగొండ జిల్లాకు బదిలీ కావడంతో పెద్దేముల్ ఎంపీవో రతన్‌సింగ్ కొన్ని నెలలుగా ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది వెంకటయ్య, నర్సింహులు ఆయన్ను సన్మానించారు.


శామీర్‌పేట : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జైపాల్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శామీర్‌పేట/కొడంగల్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆర్టీఏ జిల్లా మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈవో కమలాకర్‌తో కలిసి శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందించారు. టీపీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, టీయూటీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు శామీర్‌పేట మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో శారద-జెడ్పీహెచ్ఎస్(తుర్కపల్లి), పద్మ-జెడ్పీహెచ్ఎస్(తూంకుంట), జ్యోతి-జెడ్పీహెచ్ఎస్(దేవరయాంజాల్), కవిత-ఎంపీపీఎస్(తుర్కపల్లి), శ్వేత-ఎంపీపీఎస్(అలియాబాద్), అరుణ్‌కుమార్-ఎంపీపీఎస్(మజీద్‌పూర్), భానుప్రకాష్-జెడీహెచ్ఎస్(లాల్‌గడిమలకపేట), మురళి-ఎంపీపీఎస్ (సింగాయిపల్లి) ఉన్నారు. కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణ్, మోహన్‌బాబు పదోన్నతిపై బదిలీ అయ్యారు. వారిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం శరణు బసప్ప, ఉపాధ్యాయురాలు పూజిత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్ రాములమ్మ, కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శీను, జనార్దన్, శ్రీను, సయ్యద్, మహేష్ పాల్గొన్నారు.


శామీర్‌పేట : టీచర్లను సన్మానించిన జైపాల్‌రెడ్డి తదితరులు

ఉద్యమవీరుల జ్ఞాపకార్థం అమరవీరుల స్థూపం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన ఉద్యమ వీరుల జ్ఞాపకార్థం అమర వీరుల స్థూపాన్ని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట అమర వీరుల స్థూప నిర్మాణం కోసం బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కోదండరాం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ వీరుల జ్ఞాపకార్థం ప్రప్రథమంగా తాలుకా కేంద్రంలో అమర వీరుల స్థూపాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ జనవరి 26నాటికి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె. మదన్‌మోహన్ రెడ్డి, అగ్గనూరి విశ్వం, పి. వెంకట్‌రాంరెడ్డి, జెఏసీ నాయకులు జనార్దన్, టిజి శ్రీనివాస్, టి. కరుణాకర్, బాల్‌రాజ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నాగిళ్ళ గోపాల్‌గుప్త, జి. బాల్‌రాజ్‌గౌడ్, ఏ. కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌డి ఇబ్రహీం, పి. శ్రీశైలంగౌడ్, సర్వర్‌పాషా, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కోదండరాం, వీర్లపల్లి శంకర్ తదితరులు

ఎమ్మెల్యే కృషి అభినందనీయం: ఎమ్మెల్సీ

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అభినందనీయమని, చరిత్రలో నిలుస్తుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాల తుది రూప నమూనాను పరిశీలించి ఆనందించారు. భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్‌లు భవన నమూనాను ఎమ్మెల్సీకి చూపించారు. అలాగే షాద్‌నగర్ పట్టణంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రజాపాలన దినోత్సవంగా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ విమోచన దినోత్సవంగా బీజేపీలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ, మండల పరిషత్ కార్యాలయాలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఏబీ కాంప్లెక్స్ ఎదుట సర్దార్ వల్లబాయ్‌పటేల్ చిత్రపటం పెట్టి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

పోషణ మాసోత్సవాలను విజయవంతంగా చేపట్టాలి

మేడ్చల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నిర్వహిస్తున్న 8వ జాతీయ పోషణ మాసం ఉత్సవాలను విజయవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. బుధవారం జిల్లాలో ప్రారంభించిన జాతీయ పోషణ మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అక్టోబరు 10 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సామూహిక శ్రీమంతాలు, అక్షరభ్యాసాలు, అన్న ప్రసాన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించటంతో పాటు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను విడుదల చేశారు. అంగన్ వాడీ టీచర్లకు న్యూట్రిషన్ గార్డెన్ విత్తనాలను అందజేశారు. జిల్లా వెల్ఫేర్ అధికారి శారద, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ లీజ్ హోల్డర్స్‌కు కండిషనల్ బెయిల్

బెయిల్ రద్దు చేసి కస్టడీ ఇవ్వాలని కోర్టును కోరుతున్న పోలీసులు

తాండూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయ్ శాఖ రైస్ మిల్లులకు సరఫరా చేసిన ధాన్యం పక్కదారి పట్టించిన సంఘటనపై రిమాండ్‌కు వెళ్లిన ఇద్దరు రైస్ మిల్లర్ లీజ్ హోల్డర్లు సంతోష్ కుమార్, చల్లా వెంకటేష్‌కు కోర్టు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలైన వీరికి కండిషన్ బెయిల్ రద్దు చేసి తమ కస్టడీకి ఇవ్వాలని యాలాల పోలీస్‌లు జిల్లా కోర్టును ఆశ్రయించారు. వరి ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేసి ఇచ్చేందుకు సివిల్ సప్లయ్ శాఖ కృష్ణాసాయి రైస్ ఇండస్ట్రీస్‌కు వరి ధాన్యాన్ని పంపిస్తే.. ఆ వరి ధాన్యం తాండూరులోని మరో ఐదు రైస్ మిల్లర్లకు విక్రయించడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కాగా, ఇందుకు సంబంధించి ఏ రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారనే విషయమై ఆరా తీస్తున్నారు. అయితే, మిల్లర్లు కొంతమంది మంగళవారం రాత్రి డీఎస్పీ కార్యాలయానికి వచ్చి డీఎస్పీతో గంటల తరబడి చర్చించారు. తమ పేర్లు ఎక్కడ బయట పడతాయోనని ఇతర రైస్ మిల్లర్లు ఆందోళనలో ఉన్నారు. అయితే, ఇతర మిల్లర్లకు ఇబ్బంది కలుగకుండా రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా నాయకులు పోలీసులు, అధికారులతో రాయబారం జరుపుతున్నారు.

తెలంగాణలో వికసిస్తున్న కమలం

» స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం తథ్యం
» హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్
» అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్

ఆమనగల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కమలం వికసిస్తోందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి తొలిసారిగా అచ్చంపేటకు వెళ్తున్న గువ్వల బాల్‌రాజ్‌కు ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కడ్తాల్, ఆమనగల్లులో ఘన స్వాగతం పలికారు. బీజేపీ మండలాధ్యక్షులు దోనాదుల మహేశ్, కర్నాటి విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆయా చోట్ల పెద్దఎత్తున స్వాగత తోరణాలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. కడ్తాల, ఆమనగల్లులో భారీ ర్యాలీలు నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని బాల్‌రాజ్ సందర్శించి మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీలో బాల్‌రాజ్, ఆచారి ప్రజలకు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఆయా చోట్ల జరిగిన రోడ్ షోలలో బాల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, బీఆర్ఎస్‌ను ప్రజలు విశ్వసించడం లేదని.. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, మోదీ పాలనా దక్షతతో దేశం అద్భుత విజయాలు సాధిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంపై కమలం జెండా ఎగురుతుందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా, మండల నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ, లక్ష్మణ్, రాంపాల్ నాయక్, దుర్గయ్య, కృష్ణయాదవ్, చెన్నకేశవులు, శ్రీశైలం యాదవ్, రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీను, విష్ణు, కృష్ణ, కృష్ణనాయక్, జెనిగల గిరి, భగవాన్ రెడ్డి, నరేందర్, మల్లయ్య, సాయిలాల్ నాయక్, రాంరెడ్డి, శ్రీశైలం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్


కడ్తాలలో బాల్‌రాజ్‌ను గజమాలతో సత్కరిస్తున్న మహేశ్, బీజేపీ నాయకులు


మొక్క నాటుతున్న రాజేశ్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాందర్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తేనే భవిష్యత్‌తరాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, మల్లన్న, నర్సిములు నాయుడు, దేశ్యానాయక్, మల్లికార్జున్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


తాండూరులో జరిగిన విశ్వకర్మ జయంత్యుత్సవాల్లో శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాండూరులోని కందనెల్లి వద్ద గల వీర బ్రహ్మేంద్రస్వామి గుట్టపై బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శాసన మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేర్వేరుగా వేడుకల్లో పాల్గొన్నారు. ఇక్కడ అవసరమైన రోడ్లు, ప్రహరీ, భోజనశాల నిర్మాణంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కరుణం పురుషోత్తంరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎం.శ్రీనివాస్, సర్దార్ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస చారి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లేశం, కిరణ్, సంఘం నాయకులు పులేందర్ చారి, పాండురంగా చారీ, గద్దె శ్రీనివాస్ చారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.


తాండూరులో నిర్వహించిన జయంతి వేడుకల్లో భాగంగా హోమం వద్ద పూర్ణాహుతిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

చిరుధాన్యాల ఉత్పత్తుల శిక్షణను వినియోగించుకోవాలి

» ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి సిర్ల



వికారాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్మాణ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇస్తున్న చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి సిర్ల తెలిపారు. బుధవారం ఆమె వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల మహిళల ఎదుగుదలకు తోడ్పడేలా చిరుధాన్యాలతో వివిధ రకాల ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి మార్కెట్లో విక్రయించడానికి మద్దతుగా ఉండటంజరుగుతుందన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేస్తూ మార్కెట్ కమ్యూనికేషన్స్‌పై, వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పరిధిలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలు వినియోగించుకోవాలని తెలిపారు. ఆసక్తిగల వివరాలకు ట్రైనర్ పవన్ కుమార్‌ను 9704003144 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.


మరమ్మతులు చేయిస్తున్న తక్కళ్లపల్లి గ్రామస్థులు

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు

యాచారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారి నుంచి తక్కళ్లపల్లి వెళ్లే రహదారిపై గుంతలుండడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు వివరించినా పట్టించుకోలేదు. దాంతో రెండు రోజులుగా తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కొందరు గ్రామస్థులు గడల మల్లేష్ ఆధ్వర్యంలో కంకర పోసి రోడ్డు చదును చేయించారు. గుంతల్లో కంకరపోసి బాగు చేస్తున్నారు. కాగా, ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏఎంసీ ఫోరం జనరల్ సెక్రటరీకి సన్మానం

బషీరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోరం జనరల్ సెక్రటరీగా ఎన్నికైనా జి.మాధవరెడ్డి(ఏఎంసీ చైర్మన్ బషీరాబాద్)ని బుధవారం స్థానిక కార్యాలయంలో పాలకవర్గం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందర్‌నాయక్, సభ్యులు కొవ్వూరు నరేష్, వాల్మీకి నరేష్, మోహన్, వడ్డే హన్మంతు, ఎస్.నరేష్, మునీర్, అనూఫ్, ఎస్.వనమాల, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాధవరెడ్డిని సన్మానిస్తున్న వైస్ చైర్మన్, పాలకవర్గం సభ్యులు



తాండూరు: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో నాయకులు



వికారాబాద్: ఎస్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ నారాయణ



వికారాబాద్: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



తాండూరు రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో..



శామీర్‌పేట: తూంకుంటలో..



తాండూరు రూరల్: మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట..

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు.. తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం ఎగిరిన రోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని బుధవారం ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి ఆనాటి పోరాట ఘట్టాలను నెమరువేసుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమైక్యతా దినోత్సవం, సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నిజాం రాచరిక పాలనపై జరిగిన పోరాటాలు, హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో కలిసిన విధానం గురించి వివరించారు. ఇదే రోజు ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వికారాబాద్ జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 17



పరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మేడ్చల్ టౌన్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



మోమిన్‌పేట్: విమోచన దినోత్సవంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, నాయకులు



కీసర రూరల్: దమ్మాయిగూడలో..



బషీరాబాద్: ఐకేపీ కార్యాలయం వద్ద..

గొలుసు కట్టు.. ఆయువు పట్టు

(ఐదో పేజీ తరువాయి)

వేలాది ఎకరాలకు సాగు నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇదే పథకం నుంచి తాండూరు నియోజకవర్గంలో మధ్యమధ్యలో 24 స్పెషల్ ఓటీ పాయింట్లు, తూములను ఏర్పాటు చేసి అదనంగా మరో 15 వేల ఎకరాలకు సాగునీరందించే పథకానికి గతంలో సర్వేలు పూర్తి చేశారు. అప్పట్లో ప్రభుత్వం ప్రతిపాదనను స్వీకరించింది. అదనంగా ఈ పనుల కోసం ప్రభుత్వం పరిశీలన కూడా చేసింది. ఈ పథకం అమలైతే తాండూరు మండలంలో 44 చెరువులు ఉండగా, 23 లింకు చెరువులకు సాగునీరు చేరుతుంది. పెద్దేముల్ మండలంలో 71 చెరువులకుగాను 36 లింకు చెరువులకు, యాలాలలో 97 చెరువులకు 73 లింకు చెరువులకు, బషీరాబాద్ మండలంలో 44 చెరువులకు 33 లింకు చెరువులకు నీరు చేరనుంది.

నీటి మళ్లింపుతో చెరువులకు జీవం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రధాన కాల్వ నుంచి కోట్‌పల్లి ఇరిగేషన్, మీడియం ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం కెనాల్ కొనసాగుతున్న సమయంలో నీటిని దారి మళ్లించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నిండిన తర్వాత పెద్దేముల్ మండలంలో 20 చెరువులు, ధారూర్ మండలంలో మూడు చెరువుల కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చు. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి గొలుసు చెరువులైన అంతారం పెద్ద చెరువు అక్కడి నుంచి అంతారం ఊర చెరువు, మల్‌రెడ్డిపల్లి పల్లె చెరువు, తాండూరు పట్టణం గొల్ల చెరువు, అక్కడి నుంచి చెనిగేష్‌పూర్ గండి చెరువు నుంచి చెనిగేష్‌పూర్ మల్లన్నకుంట చెరువు నుంచి కోణాపూర్ కసిమోళ్ల కుంట వరకు ఆయా చెరువులను నింపడంపై గతంలో ప్రణాళిక రూపొందించారు. మరో వైపు మంబాపూర్ సంగాయిచెరువు నుంచి పెద్ద చెరువు, జనగామ గోసాయోనికుంట నుంచి దుగ్గాపూర్ పెద్దమ్మ కుంట చెరువు, అక్కడి నుంచి కొండాపూర్ దాసరికుంట తర్వాత పెద్ద చెరువు నుంచి పటేల్ కుంట, మన్‌సాన్‌పల్లి కామిరెడ్డికుంట, లక్ష్మీపేట కుంటకు అక్కడి నుంచి పెద్దేముల్ ఊర చెరువుకు నీరు చేరుతుంది.

యోధుల త్యాగాలతోనే విముక్తి

(ఐదో పేజీ తరువాయి)

దించడంతో నిజాంకు లొంగిపోక తప్పలేదన్నారు.

రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించాం..

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నదని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. రైతులను రుణ విముక్తి చేసేందుకు దేశ చరిత్రలో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు. జిల్లాలో 1,00,358 మంది రైతులకు రూ.849 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల వంతున జిల్లాలో 2,76,537 మంది రైతుల ఖాతాల్లో రూ.363.10 కోట్ల పెట్టుబడి సాయం జమ చేసిందని తెలిపారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు జిల్లాకు 13,540 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 11,681 ఇళ్లు నిర్మించేందుకు ఆమోదం తెలిపారని చెప్పారు. చేయూత పథకం ద్వారా జిల్లాలో 1,09,283 మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.27.36 కోట్ల పెన్షన్ల రూపంలో సాయం అందుతోందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జిల్లాలో 19,888 కుటుంబాలకు రూ.11.93 కోట్లు చెల్లించారని చెప్పారు.

ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ

2047 నాటికి భారతదేశ ముఖ చిత్రాన్ని మార్చే గేమ్ ఛేంచర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పీకర్ చెప్పారు. ప్రజా ప్రభుత్వం సంకల్పానికి దార్శనిక పత్రమే తెలంగాణ రైజింగ్ -2047 అని, 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లే మహత్తర లక్ష్య పత్రమే తెలంగాణ రైజింగ్ -2047 అని ఆయన గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగడంలో భాగస్వాములవుతున్న వారందరికీ ధన్యవాదాలు చెప్పారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ సారథి కళాకారులు ఆలపించిన గేయాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారికి స్పీకర్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ మ్యాపింగ్‌ను పూర్తి చేయాలి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 2022 - 2025తో ఓటరు జాబితాను పోల్చి రెండింటిలో ఉన్న ఎలక్టోరల్ వివరాలను నిర్ణయించిన ఫార్మట్‌లో పూర్తి చేసి బీఎల్‌వోలు అందించాలని ఎన్నికల అధికారులు సూచించారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఎంపీవో యాదగిరి, ఆర్ఐలు గోవర్ధన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

చౌడాపూర్/కులకచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చాకల్‌పల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పరిశీలించారు. పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందన్నారు. నాయకులు దామోదర్‌రెడ్డి, నర్సిములు, శివకుమార్, చంద్రశేఖర్, వెంకటయ్య తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇంటితో కల సాకారం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో సొంతింటి కల సాకారమైందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని అనంతసాగర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర, సెప్టెంబర్17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్వస్థ నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కీసర పీహెచ్‌సీలో ఐదు రోజుల పాటు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మనూజా రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, మాజీ ఎంపీటీసీ బెలిదె రమేష్ గుప్తా, చర్లపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కీసర: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

250 మందికి వైద్య పరీక్షలు

కులకచర: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి ప్రారంభించారు. 250 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్, సరిత, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

పాత ఎండీపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘంలో రైతులకు రుణమాఫీ కాకపోవడానికి గత ఎండీ కరుణకర్ నిర్లక్ష్యమే కారణమని, అతడిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని సహకార సంఘం డైరెక్టర్ సీహెచ్ ధర్మారెడ్డి బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అర్హులైన రైతుల రుణమాఫీ జాబితాను ప్రభుత్వానికి అప్పటి ఎండీ ఆలస్యంగా పంపించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గత ఎండీ చేసిన తప్పిదంతో 1,189 మంది రైతులకు రుణమాఫీ అందకుండా పోయిందన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సిములు

దౌల్తాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బీజేపీ నాయకుడు కుంద్రు నర్సిములు నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించడంతో మండల అధ్యక్షుడు అశోక్, మాజీ అధ్యక్షుడు సతీశ్‌ముదిరాజ్, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మిక సంక్షేమానికి కృషి

ఘట్‌కేసర్: కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని ఔటర్ చౌరస్తాలో ఆయా రంగాల కార్మికులకు లేబర్ కార్డుల కోసం వివరాలను నమోదు చేయించారు. అనంతరం ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామంలో బుధవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చట్టాలపై అవగాహన

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అంజిలయ్య, ఎస్సై వసంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

దోమ: మండలంలోని అయినాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబుచంద్ హిందీ భాషా ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. హిందీ ఉపాధ్యాయుడు నయీముద్దీన్ రూ.5 వేల విలువైన పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

ఊబకాయంపై అవగాహన

మేడ్చల్ టౌన్: జాతీయ చిన్నపిల్లల ఊబకాయ అవగాహన మాసాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని మెడిసిటీ ఆసుపత్రి వైద్యులు గ్రామాల్లో ఊబకాయంపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛతాహీ సేవపై ప్రతిజ్ఞ

పరిగి: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో బుధవారం పరిగి పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ దశరథం పాల్గొన్నారు.

అడవి పందుల దాడితో పంటలు ధ్వంసం

కులకచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఘనపూర్ గ్రామంలో రైతు రామయ్య పొలంలో జొన్న పంటపై అడవి పందుల గుంపు దాడి చేయడంతో పంట మొత్తం ధ్వంసమైంది. వారం రోజులుగా ముజాహిద్‌పూర్, తిరుమలాపూర్, కులకచర్ల, సాల్విడ్, పీరంపల్లి తదితర గ్రామాల్లో పంటలపై అడవి పందులు దాడి చేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం

తాండూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామని ఎంఈవో వెంకటయ్య అన్నారు. తాండూరు మండల పరిధిలోని అంతారంతండా ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. 14 మంది ఎస్జీటీలు, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లను ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ఆయనవెంట హెచ్ఎం రమేష్, సీఆర్పీ సుభాష్ ఉన్నారు.

IN THE COURT OF PRL. DISTRICT AND SESSIONS JUDGE AT JANGOAN

O.S.No. 167 OF 2017

Between:- Kamidi Srinivas Reddy & others ...Plaintiffs

And

Arege Bikshapathi (Died) his Lrs. 5 to 7 & others ... Defendants

NOTICE

To,

Defendant No.5:- Arege Srinivas s/o Late Bikshapathi, aged about: 42 years, Occ: Business, **Defendant No.6:-** Arege Sridar s/o Late Bikshapathi, aged about: 40 years, Occ: Business, Defendant No.5 Arege Srikanth s/o Late Bikshapathi, aged about:35 years, Occ: Business, All are R/o Plot No. 28 Ravindra Nagar Colony, Nagaram Village, Keesara Mandal, Medchal-Malkajgiri District.

(Defendant No. 5 to 7)

Please take Notice, That the petitioner has instituted a case for I. A. . for Suit for specific performance of contract against you (defendant No.1) who is father of the Defendant No. 5 to 7 Legal representatives of deceased defendant No.1 (died) before PRINCIPAL DISTRICT AND SESSION JUDGE AT JANGOAN. Several Notice were sent to you through court and R.P. you are avoiding to receive the notice. That the above case is posted to 23-09-2025 at 10:30 A.M. for your appearance. Hence you are directed to appear in person or through an advocate failing which, the case will be disposed of expert. Hence this notice.

"By Order" Date: - 17-09-2025 Jangaon

"By Order of the Court

Sd/- SRI. N.SIDDULU, MA.LLM., ADVOCATE, JANGAON, Dist: WARANGAL CELL: 9848549703

ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

బీజేపీ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్నదానాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి):



వికారాబాద్: అన్నదానం చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్



తాండూరులో అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు



యాలాలలో బోరు వేయిస్తున్న బీజేపీ నాయకులు



మర్పల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి



మోమిన్‌పేట్: ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి



బంట్వారంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

కీసర రూరల్: విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన రుద్రకుమార్‌దాస్(20) వారం క్రితమే హైదరాబాద్‌లోని తన మిత్రుల వద్దకు వచ్చాడు. ప్లంబర్ పని చేసేందుకు ధారావత్ సురేష్ అనే కాంట్రాక్టర్ వద్ద చేరాడు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ యాద్గార్‌పల్లిలోని ఓ ఇంట్లో మిషన్‌తో డ్రిల్లింగ్ చేస్తుండగా కరెంట్ వైర్ తగిలి షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..

బొంరాస్‌పేట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన కనకప్ప(26) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కనకప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న ఆశప్ప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందుతాగి మహిళ

కోట్‌పల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన కోట్‌పల్లి పోలీస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శైలజ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాసన్‌పల్లికి అనసూజ(38) భిక్షపతి దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త భిక్షపతి మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పెట్టుకోవడంతో పురుగుల మందు తాగింది. వెంటనే స్థానికులు వికారాబాద్ ఆసుపత్రికి తరలిచారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా బుధవారం మృతి చెందింది. అనుసూజ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు

కొడంగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. 2019లో కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన దత్తు, చందు, చెట్టుకింది సురేశ్‌తోపాటు కొత్తపల్లి గ్రామానికి చెందిన గొల్ల మారుతి డీజిల్ కోసం బైక్‌పై కొడంగల్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో పర్సాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో దత్తు, చందు, గొల్ల మారుతి మృతి చెందగా సురేశ్‌కు గాయాలయ్యాయి. విచారణలో భాగంగా బుధవారం కోర్టులో వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి శ్రీరామ్ ప్రమాదానికి కారణమైన నేరస్తుడికి శిక్ష వేస్తూ తీర్పునిచ్చారు.

ఆటోల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) ఆటోల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసి మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపేట మున్సిపాలిటీ లింగాపూర్ నివాసి కోర్పతి శ్రీరాములు(30) బుధవారం అనుమానస్పదంగా మేడ్చల్ డిపో వద్ద తిరుగుతుండటంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఆటోల దొంగతానికి పాల్పడుతున్నట్లు బయటపడింది. అతని వద్ద నుంచి మూడు ఆటోలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దుండిగల్ పోలీస్టేషన్ పరిధిలో పలు దొంగతనం కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.



కొడంగల్‌లో ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

కొడంగల్/పరిగి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవాలను విశ్వకర్మలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కొడంగల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మహదేవ శివాలయం ఆవరణలో కాళికాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే పరిగిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వకర్మలు పూజలు నిర్వహించారు. బైక్ ర్యాలీ తీశారు. విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు పాండురంగాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదారం శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

యాలాల/బషీరాబాద్/తాండూరు రూరల్, సెప్టెంబర్ 17, (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. యాలాల మండలం పేర్కంపల్లి, ముద్దాయిపేట్‌కు జేడీ యాదప్ప, భాగ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వికారాబాద్‌లోని మేడిక్యూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మహేందర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనవెంట టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, నాయకులు రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు. అలాగే బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి మాజీ సర్పంచ్ తండ్రి ముత్యప్ప ఇటీవల మృతి చెందాడు. ప్రభుత్వ చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లికి చెందిన మణికంఠ శ్రీనివాస్ తల్లి సుమిత్ర మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి మృతురాలి భర్త మొగులయ్య, కుమారులను పరామర్శించారు.

మాజీ జెడ్పీటీసీ మృతిపై సంతాపం

నవాబుపేట: మండలంలోని పులుమామిడికి చెందిన మాజీ జెడ్పీటీసీ మాణిక్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, వివిధ పార్టీల నాయకులు భీమ్‌భరత్, వెంకటయ్య, భీమ్‌రెడ్డి, సుమలత, రంగారెడ్డి, దయాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కోట్‌పల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ తెలియజేశారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం, కూరగాయలు పెడుతున్నారాఅని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో డానియల్, మండల విద్యాధికారి చంద్రప్ప, ఎంపీఓ సుధీర్ రెడ్డి ఉపాధ్యయులు, విద్యార్థులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్